క్లుప్తంగా

చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ



గర్భిణులకు పోషకాహార కిట్ అందిస్తున్న సీడీపీఓ ఇందిర

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహార కిట్‌లు బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యానికి ఉపకరిస్తాయని సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర అన్నారు. గ్రామ ఆరోగ్య పోషణ దినం (వీహెచ్ఎన్‌డీ) సందర్భంగా శుక్రవారం శిరగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోఆమె పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్‌లో పోషకాహారాన్ని వృథా చేయకుండా భుజించాలని సూచించారు. అనంతరం గ్రామ స్థాయి బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, అంగన్‌వాడీ వర్కర్ పి.వెంకటలక్ష్మి, ఏఎన్ఎం బి.సావిత్రి, ఆశ కార్యకర్త కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యస్థలంకలో క్షేత్ర దినోత్సవం



సిద్ధాంతంలో క్షేత్ర దినోత్సవం

పెనుగొండ: ఉండి కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామం సిద్ధాంతం మధ్యస్థలంకలో శుక్రవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 35 ఎకరాల్లో శారద రకం నువ్వులను సాగు చేయడానికి విత్తనాలు పంపిణీ చేశారు. ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, 54 శాతం నూనే కలిగి ఉండి 85 నుంచి 90 రోజులకు కోతకు వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. బెండ, వంగ, గోరుచిక్కుడు, బొప్పాయి పంటలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్ మల్లికార్జునరావు, ఎ.శ్రీనివాసరావు, పి.వినయలక్ష్మి, వ్యవసాయాధికారి పి.స్పందన, కె.చందు, కార్తీక్ రెడ్డి, సీహెచ్ గనిరాజు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలపై దృష్టి



వడలిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మూర్తి

పెనుగొండ: చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల వినియోగంపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం వడలిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. తడి, పొడి చెత్త సేకరణ, ఘన పదార్థాల నిర్వహణ, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీ రెడ్డి గణేశ్వరరావు, డీపీఆర్‌సీ టీం లీడరు ఎడ్వర్డు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



వడలిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనుగొండ: వడలిలో బెరాకా బ్లెస్సింగ్ నవజీవన సహవాస సమాజం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి బుద్ధుడు హస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. సమాజం సభ్యులు, పాస్టర్ గంజి స్టీవెన్‌లు పాల్గొన్నారు.

ముఖధారమ్మకు కుంకుమ పూజలు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చిన్నరాజా దంపతులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ముఖధారమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మల్లె పందిరి నీడలో అమ్మవారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల లక్ష్మణ గోవింద్ (చిన్నరాజా) దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. రాత్రి 7 గంటలకు అమ్మవారికి పంచ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు వల్లభు శ్రీను, మండెల జిజి, చెక్కా కృష్ణ, చినిమిల్లి బాబి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లప్ప కాలువకు మోక్షమెప్పుడో?

- పంట కాలువలోకి వాడకం నీరు
- సాగునీటికి రైతుల ఇబ్బందులు



పెనుగొండలో బక్కచిక్కిన ఎల్లప్ప పంటకాలువ



ఎల్లప్ప కాలువలో కలుస్తున్న మురుగు



వరి చేల సమీపంలోకి మురుగు కూపంలా మారిన కాలువ

పెనుగొండ: వందలాది ఎకరాలకు సాగు నీరు అందించే పంటకాలువ మురుగు కాలువలా మారింది. దీంతో ఎల్లప్ప కాలువపై ఆధారపడి వరి పంట సాగు చేస్తున్న రైతన్నలు కాలువకు మోక్షమెప్పుడో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం ప్రధాన కాలువ నుంచి పెనుగొండ వద్ద సాగునీటికి ఎల్లప్ప కాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువ నుంచి వచ్చే నీటిని గతంలో పెనుగొండ ప్రజల దాహార్తి తీర్చడానికి పంచాయతీ చెరువులోకి నీటిని మళ్లించి తాగునీటిగా వాడేవారు. కాలక్రమేణా, చెరువు నీటిని తగ్గించి బోరు నీటిని వాడుతుండడంతో ఎల్లప్ప కాలువ నీరు సాగుకు మాత్రమే వినియోగిస్తున్నారు.

గ్రామం మధ్య నుంచే పారడం శాపం

ఎల్లప్ప కాలువ ఎక్కువ భాగం పెనుగొండ గ్రామం మధ్య నుంచే ప్రవహించడం శాపంగా మారింది. కాలువ పారే ప్రాంతంలో సంత మార్కెట్, నివాస గృహాలు, వ్యాపార దుకాణాలు ఉన్నాయి. దీంతో వాడకం నీటిని ఎల్లప్ప కాలువలోకి మళ్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంటకాలువ మురుగు కాలువగా మారిపోయింది. దీంతో రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

ఆగిన ఆధునికీకరణ

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో నాటి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చేపట్టిన ఎల్లప్ప కాలువ ఆధునికీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామం మధ్యలో పంట కాలువపై శ్లాబ్‌వేసి సాగు నీరు నేరుగా వరి చేలకు వెళ్లే విధంగా ప్రణాళిక రూపొందించారు. అయితే, ఆధునికీకరణ పూర్తికాకుండానే పనులు నిలిచిపోయాయి. నాటి నుంచి ఎల్లప్ప కాలువ పంచాయతీకి భారంగా, విమర్శగా మారింది. ప్రతి సారీ సమీపంలోని నివాసాల వారికి, దుకాణాల వారికి హెచ్చరికలు జారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆధునికీకరణతోనే ఎల్లప్ప కాలువకు మోక్షం కలుగుతుందని భావించి, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇటీవల డెప్యూటీ సీఎం పవన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఎల్లప్ప కాలువ మురుగు సమస్య తీరుతుందన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

రీ సర్వేకు సహకరించండి



దొడ్డిపట్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగ వెంకట పవన్‌కుమార్

యలమంచిలి: రైతులంతా రీ సర్వేకు సహకరించాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ కోరారు. రీ సర్వే ప్రాజెక్ట్–2 రెండో విడత కార్యక్రమంలో పైలట్ గ్రామంగా ఎంపికైన దొడ్డిపట్లలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేశవస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేతో భూ వివరాలు ఖచ్చితంగా తెలుస్తాయని, భూ కొలతల సమయంలో సర్వే సిబ్బందికి సహకరించాలని రైతులను కోరారు. సర్వేలో లోటుపాట్లపై అభ్యంతరం తెలిపితే మళ్లీ సర్వే చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన ప్రమీలకుమారి, ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొప్పాడి శ్రీనుబాబు, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్ సన్, ఆర్ఐ కవురు యశోద, గ్రామ రెవెన్యూ అధికారులు కాకితాపల్లి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

చెత్తరహిత నరసాపురానికి కృషిచేద్దాం

కలెక్టర్ నాగరాణి



నరసాపురం : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి



నరసాపురం రూరల్ : వేములదీవిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం: చెత్తరహిత నరసాపురం నినాదాన్ని నిజం చేసేందుకు సహకరించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పరిశుభ్ర నరసాపురం – తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై కౌన్సిలర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మున్సిపాలిటీలో చెత్తను గోదావరి గట్టున పోయడం వల్ల జాతీయ కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఇబ్బందులు వచ్చాయని చెప్పారు. డంపింగ్ యార్డ్‌ను గోదావరి గట్టు నుంచి మార్చడానికి ట్రిబ్యునల్ వద్ద కొంత సమయం కోరామని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని సూచించారు. హోటల్స్, కల్యాణ మండపాలు, హాస్పటల్స్ తదితర ప్రాంతాల వద్ద ఒకే రోజు 50 కిలోల మించి చెత్తను అందిస్తే తీసుకోవద్దని కలెక్టర్ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజూ 50 కిలోల మించి చెత్త ఉంటే సొంతంగా పిట్స్ ఏర్పాటు చేసుకుని, కంపోస్ట్‌గా మార్చుకునే పద్ధతులవైపు వెళ్లాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చెత్త రహిత నరసాపురంగా తీర్చిదిద్దే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పుష్కరాలు సమీపిస్తున్నందున గోదావరి గట్టు నుంచి డంపింగ్‌యార్డ్‌ను తరలించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పని కల్పించాలి

నరసాపురం రూరల్: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ పని కల్పించాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేములదీవి ఈస్ట్‌లో ఉపాధి హామీ పనులను, లక్ష్మణేశ్వరం జగనన్న కాలనీని ఆమె సందర్శించారు. 1500 మీటర్ల పరిధిలో మురుగు బోదెలో పూడిక తీత చేపట్టామని, 80 మంది కూలీలు పనిచేస్తున్నారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. లక్ష్మణేశ్వరంలో 93 ప్లాట్లు కేటాయించి, 85 ఇళ్లు మంజూరు చేయగా 47 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కాలనీకి రాకపోకలు సాగించే ఒక దారి మూసివేయడం, తాగునీరు, డ్రెయినేజీ, తదితర సమస్యలను మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ దాసి రాజును ఆదేశించారు.

పీఎం లంక అభివృద్ధికి చర్యలు

కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ సహకారంతో పీఎం లంకను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని కలెక్టర్ నాగరాణి అన్నారు. పెదమైనవానిలంక డిజిటల్ భవనాన్ని, పీఎం లంక సముద్రపు కోతకు గురయ్యే ప్రాంతంలో డెలాయిట్ కంపెనీ చేపట్టనున్న ప్రాజెక్ట్ ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. గ్రామంలో ఎంపిక చేసిన 100 ఇళ్లకు సబ్సిడీతో, డిజిటల్ భవన్‌కు సోలార్ విద్యుత్ ఏర్పాటు పనులను ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. ఎమ్మెల్యే బొమ్మిడ నాయకర్ మాట్లాడుతూ సోలార్ ప్యానల్స్ ద్వారా నిరంతర విద్యుత్ ఉచితంగా సమకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ ఈవీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జీవీఎస్ కష్ణంరాజు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, డ్వామా ఏపీఓ శ్రీనివాస్, హౌసిగ్ ఈఈ ఎం.శ్రీనివాస్, డీఈఆర్ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కోకోనట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కఠారి



కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కఠారి నాగేంద్ర, కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కోకోనట్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కఠారి నాగేంద్రకుమార్ గెలుపొందారు. శుక్రవారం అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నాగేంద్ర కుమార్ 29 ఓట్ల మెజార్టీతో యినకొండ రంగారావుపై, ద్వితీయ ఉపాధ్యక్షుడిగా కుందూరు వెంకట్రామయ్య 8 ఓట్లతో వీరగుమ్మల వెంకటకృష్ణపై విజయం సాధించారు. సెక్రటరీ మాటూరి సోమేశ్వర వెంకట రామకుమార్, ట్రెజరర్ దేవరపు శ్రీనివాస్, ప్రథమ ఉపాధ్యక్షుడు చివటపు నాగేశ్వరరావు, తృతీయ ఉపాధ్యక్షులు లంకలపల్లి నాగ వెంకట సత్య రమేష్, సహాయ కార్యదర్శి కొండేటి శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ సభ్యులు పట్టుపట్టడంతో ఎన్నిక అనివార్యమైందని చాంబర్ ఉపాధ్యక్షుడు దేవరపు లక్ష్మీనారాయణ తెలిపారు. యువ నాయకులు పదవుల్లో ఉంటే సంఘం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. నూతన కార్యర్గానికి అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

వైద్య రంగంలో మెరుగైన ఉద్యోగావకాశాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాధామనోహర్

నరసాపురం: ప్రస్తుతం వైద్య రంగంలో మెరుగైన ఉద్యోగ అవకాశాలున్నాయని అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పటల్ మేనేజర్ కవురు రాధామనోహర్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎన్ కళాశాలలో హెచ్ఆర్డీ సెంటర్, ఐక్యూఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో హాస్పటల్ మేనేజ్‌మెంట్, ప్లేస్మెంట్స్ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైద్యరంగంలో కేవలం వైద్యకోర్సులు చదివినవారికే కాకుండా, ఎంబీఏ లాంటి కోర్సులు చేసిన వారికీ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. హాస్పటల్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అంశాల్లో నైపుణ్యం పెంచుకోవడం ఉపయుక్తమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, హెచ్ఆర్డీసెంటర్ కన్వీనర్ చినిమిల్లి శ్రీనివాస్, డీన్ గంధం రామకృష్ణ, ఆర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల మత స్వేచ్ఛపై బీజేపీ దాడి



పెనుగొండలో మసీదు వద్ద సీపీఎం నిరసన



ఆచంట మసీదు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెనుగొండ: వక్ఫ్ సవరణలు బీజేపీ హిందుత్వ ఎజెండాలో భాగమేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం పెనుగొండ జామియా మసీదు వద్ద జరిగిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. మైనారిటీల మత స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. సిద్ధాంతం మసీదు వద్ద జరిగిన నిరసనలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తి తగ్గడం ద్వారా బోర్డులో ముస్లిమేతర సభ్యులను చేర్చడం, ఆస్తి గుర్తింపులో ప్రభుత్వ జోక్యం పెరగడం వల్ల సంస్థల స్వతంత్రత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో షేక్ మీరా మీర్జా, రెడీమేడ్ బాషా, షేక్ సుజాయుద్దీన్, షాకీద్ బాయ్, ఎస్కే షరీఫ్, సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, కడలి త్రినాథ్‌లు పాల్గొన్నారు.

- వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా ఆచంట మార్కెట్ ప్రాంత మసీదు వద్ద సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమటీ సభ్యులు తలుపూరి బుల్లాబ్బాయి, కుసుమ జయరాజు, నేతలు, తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారాఉ, ముస్లిం మత గురువు షేక్ మస్తాన్, షేక్ సయ్యద్ బాజీ, నాగూర్ కాశీం, వల్లి లేకుత్, ఖాదర్ బాషాలు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం



కరపత్రం విడుదల చేసిన డాక్టర్ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థి జీవితంలో కళాశాల విద్య అత్యంత ప్రాముఖ్యమైందని కళాశాల విద్యా జోన్–1, –2 ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్ శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ తిరువీధుల రాజరాజేశ్వరి అధ్యక్షతన డాక్టర్ నందుల బుచ్చిరామయ్య కళావేదిక వద్ద 58వ వార్షికోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. శోభారాణి మాట్లాడుతూ స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, నెల్సన్ మండేలా వంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని విజయాలు సాధించాలని సూచించారు. తొలుత బాబూజగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నెల 8న జాతీయ స్థాయి మేధో సంపత్తి హక్కులపై శిక్షణ శిబిర కరపత్రం, కళాశాల మొదటి సంవత్సరం డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశ పత్రాలను విడుదల చేశారు. క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాఘవులు, డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు బూసి వెంకటస్వామి, ఎస్‌వీడీ దినకరన్, ఉషారాణి పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామరాజు



సామంతపూడి శ్రీరామరాజు



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాలకొల్లుకు చెందిన సామంతపూడి శ్రీరామరాజు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం భీమవరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా చవ్వాకుల నరసింహరావు (భీమవరం), కొత్తపల్లి సూర్యనారాయణ (అత్తిలి), కార్యదర్శిగా కొత్త వెంకట శ్రీరామనారాయణ (శ్రీనివాస్, ఆకివీడు), సహాయ కార్యదర్శులుగా పేరూరి వీఎస్ఎన్ రాధాకృష్ణ (ఆకివీడు), అనంతపల్లి ఫణీంద్ర రామ వెంకట సుబ్బారావు (మొగల్తూరు), కోశాధికారి పెరుమాళ్ల వెంకట శ్రీహరినాథ్ (గణపవరం)లను ఎన్నుకున్నట్టు అసోసియేషన్ సభ్యులు పోలిశెట్టి దాసు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారని పేర్కొన్నారు.

తూతూమంత్రంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన అర్జీదారులు

నరసాపురం రూరల్: చంద్రన్న స్వయం ఉపాధి సోపానం 2024–25 సంవత్సరం సబ్సిడీ రుణాల మంజూరుకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలి రోజు ఇంటర్వ్యూలకు చిట్టవరం, మల్లవరం లంక, కె.నవరసపురం, గొంది, సరిపల్లి, లిఖితపూడి, లక్ష్మణేశ్వరం, సారవ, కొప్పర్రు, మల్లవరం, కె బేతపూడి గ్రామాలకు చెందిన 1,358 మంది దరఖాస్తుదారుల్లో 568 మంది మాత్రమే హాజరయ్యారు. ధ్రువీకరణ పత్రాలను తీసుకుని వెళ్లమని చెబుతున్నారని, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్న వారికే రుణం దక్కేలా ఉందని అర్జీదారులు వాపోతున్నారు. మండలంలో 3,780 మంది దరఖాస్తు చేసుకోగా 116 మందికే రుణాలు మంజూరు చేయనున్నట్టు చెబుతున్నారు.

కాలనీలోకి పంట కాల్వ నీరు



బ్రాహ్మణచెరువులో జగనన్న కాలనీలోకి ప్రవేశించిన కాలువ నీరు



కాలనీవద్ద గట్లపై నుంచి పొంగి ప్రవహిస్తున్న వీరవాసరం కాలువ

పెనుమంట్ర: బ్రాహ్మణచెర్వు గ్రామంలో నేలపోగులు – వీరవాసరం బ్రాంచ్ పంట కాల్వ మధ్యలో ఉన్న జగనన్న కాలనీలోకి నీరు ప్రవేశించడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్, వి.భాస్కరరావు శుక్రవారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. వీరవాసరం కాల్వ ఎడమ వైపు, నేలపోగులు కాల్వ కుడి వైపు గట్టు లోలెవల్‌లో ఉందని తెలిపారు. వంతుల వారీ సాగు నీరు అందించే సమయంలో మెయిన్ కెనాల్ పై డ్యాములు పూర్తిగా ఎత్తివేయడం, దిగువన కాల్వలు పూడికపోవడంతో పొలాలు ముంపు బారిన పడటమే కాకుండా జగనన్నకాలనీలకు నీరు ప్రవేశిస్తుందని వివరించారు. కాల్వ గట్లను పటిష్ఠం చేసి, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

చెట్లు కూలి తెగిపడిన విద్యుత్ వైర్లు



విరిగిపడిన విద్యుత్ స్తంభం

పెనుమంట్ర: మండలంలోని వెలగలవారిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున కొద్దిపాటి గాలివానకు చెట్లుకూలి విద్యుత్ వైర్లు పడటంతో స్తంభం విరిగి వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన దళితవాడలో తాళ్లచెరువువెళ్లే రోడ్డులో ఉన్న పబ్లిక్ మరుగుదొడ్ల వద్ద జరిగింది. మధ్యాహ్నం వరకు అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డులో రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

దగా చేసిన చంద్రబాబు

పాలకొల్లు సెంట్రల్: ముస్లిం చంద్రబాబును నమ్మి ఓట్లు వేస్తే దగా చేశారని కాంగ్రెస్ మైనారిటీ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ రసూల్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అంటూ కేంద్రం ముస్లిం వక్ఫ్ ఆస్తులకు చిల్లు పెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఆయా ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఉభయ సభల్లో గెలవడానికి చంద్రబాబు, నితీష్ కుమార్‌లే కారణమని వివరించారు. మైనార్టీలకు ఏ పార్టీ న్యాయం చేస్తుందో ఆ పార్టీకే మద్దతు తెలపాలని ముస్లింలకు సూచించారు.

పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపట్టాలి

భీమవరం: పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపడితే భవిష్యత్తులో సొసైటీకి ఉపయోగంతో పాటు విద్యార్థుల ఉన్నతికి దోహదపడతాయని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు పేర్కొన్నారు. కళాశాల ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో క్రక్స్ 2కే25 పేరిట హార్డ్‌వేర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోలార్ సిస్టం, రోబోట్, సాయిల్ టెస్టింగ్‌తో పాటు ఎన్నో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
90102 23729 (పాలకొల్లు)
95055 07552 (పాలకొల్లు)
90102 23729 (ఆచంట)
95055 07552 (నరసాపురం)

Office mail : tpgadvt@gmail.com